




ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి భరత్, ప్రోగ్రామ్ స్పెషల్ ఆఫీసర్ వీరపాండియన్

అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి

- కొనుగోలులో దళారుల చేతివాటం - నష్టపోతున్న ఉల్లి రైతులు, వినియోగదారులు

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

ఉల్లి రైతులు, వినియోగదారుల పరిస్థితి అమ్మబోతే అడవి కొనబోతే కొరివి అన్న చందంగా తయారయింది. ఆరుగాలం చెమటోడ్చి పండించిన ఉల్లి పంట చేతికి అందినా, పండించిన పంటకు గిట్టుబాటు ధర సంగతి అటు ఉంచితే కనీసం పెట్టిన పెట్టుబడి ఖర్చులు చేతికందడం లేదు. మరోవైపు వ్యవసాయ మార్కెట్లో ఉల్లి ధరకు బహిరంగ మార్కెట్‌లో ఉల్లి ధరకు ఏ మాత్రం పొంతన లేకుండా ధరలు మండుతున్నాయి. ఉల్లిని కోయకుండానే వినియోగదారుల కళ్లల్లో కన్నీళ్లు సుడులు తిరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బుల్లి అమ్మబోతే అడవి కొనబోతే కొరివి అన్న చందంగా ఉల్లి రైతులు, వినియోగదారుల పరిస్థితి తయారయింది. గతంలో బుల్లికి అత్యంత ధర పలకడంతో జిల్లాలో ఉల్లిని రైతులు భారీ ఎత్తున సాగు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలో దాదాపు 45 వేల ఎకరాల్లో ఉల్లిని సాగు చేశారు. రైతులు ఆశించిన దానికంటే దాదాపు ఉల్లి మంచి దిగుబడిని ఇచ్చింది. అనుకున్నదొకటి అయిందొకటి అన్న చందంగా అకాల వర్షాలు, అధిక వర్షాలు కారణంగా పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతుల ఆశలు అడియాశలుగా మారాయి. రైతులు, రైతు సంఘాల ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి క్వింటాలుకు రూ.1200 చొప్పున కొనుగోలు చేస్తానని గతంలో ప్రకటించిన హామీ అమలకు పూనుకుంది. మార్క్ఫెడ్ ద్వారా నాలుగైదు రోజులు కొనుగోలు చేసి ప్రస్తుతం విరమించుకుంది. హెక్టారుకు రూ.50 వేల చొప్పున పంట నష్టపరిహారంగా చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. రైతులు ఓపెన్ మార్కెట్లోనే విక్రయాలు చేసుకోవాలని ప్రభుత్వం చేతులెత్తేసింది. వ్యవసాయ మార్కెట్లో అమ్మడానికి వెళితే ప్రస్తుతం అక్కడ దళారులు సరుకు నాణ్యతను బట్టి క్వింటా రూ.50 నుంచి రూ.500 చొప్పున ఉల్లి ధర పలుకుతోంది. సరాసరిన రూ.300 క్వింటా ఉల్లి ధర పలుకుతుంది. అంటే కిలో రూ.3 చొప్పున పలుకుతుంది. ఇదే ఉల్లి సాధారణ బహిరంగ మార్కెట్లో కిలో రూ.20 నుంచి రూ.25 చొప్పున అమ్ముతున్నారు. దీంతో అటు రైతులు ఇటు వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. దళారులు మాత్రం లాభాలను మూట కట్టుకుంటున్నారన్న విమర్శ బహిరంగంగానే వినిపిస్తోంది. దీని పట్ల అధికారులు చొరవ చూపాల్సిన అవసరం ఉందని పలువురు భావిస్తున్నారు.



గొర్రెలకు వదిలేసిన ఉల్లి పంట

గిట్టుబాటుకాక పంటను వదిలేశా

-పాండురంగారెడ్డి, రైతు, ఉల్చాల.

ఉల్లికి మంచి ధర పలుకుతుందని ఆశతో పంటను రెండున్నర ఎకరాల్లో సాగు చేశాను. తీరా పంట చేతికొచ్చిన తర్వాత ధర పడిపోయింది. పంట దిగుబడిని కోసేందుకు ఖర్చులకు కూడా రావడం లేదు. పంటను చేల్లోనే పశువులకు వదిలేశాను.

పొంతన లేని ఉల్లి ధరలు

-మద్దిలేటి, వినియోగదారుడు.



ఉల్లి ధరలలో ఏమాత్రం పొంతన లేకుండా పోతుంది. రైతు అమ్మడానికి వెళ్తే మార్కెట్లో ధర తీవ్రంగా పడిపోయింది. అదే సరుకును బహిరంగ మార్కెట్లో కొనడానికి వెళ్తే వందల రెట్లు పెట్టి కొనాల్సి వస్తోంది. ఆటు రైతులు ఇటు వినియోగదారులు నష్టపోతున్నారు తప్ప బాగుపడేది దళారులే.

క్వింటాకు రూ.2500 ఇవ్వాలి

- జి.రామకృష్ణ, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి



జిల్లాలో రైతులు ఉల్లి విస్తారంగా పండించారు. ఉల్లి క్వింటాకు రూ.2500 ధరప్రభుత్వమే కల్పించాలి. ఉల్లిరైతుల పంట నష్టపరిహారంగా ఎకరాకు రూ. 20,000 ప్రకటించి ప్రభుత్వం రైతులను మోసం చేసింది. రైతులకు న్యాయం చేసే వరకు రైతు సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేపడతాం.

ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలి

- మంత్రి టిజి.భరత్ - ప్రధాని పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ప్రధాని నరేంద్రమోడీ పర్యటనను జిల్లా ప్రజలు విజయవంతం చేయాలని రాష్ట్ర మంత్రి టిజి.భరత్ కోరారు. ఈనెల 16న ప్రధాన మంత్రి మోడీ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్, ప్రధానమంత్రి ప్రోగ్రామ్ స్పెషల్ ఆఫీసర్, సీనియర్ ఐఎఎస్ అధికారి వీర పాండియన్‌లు శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ... కర్నూలు పర్యటన సందర్భంగా ప్రధాన మంత్రి శ్రీశైల భ్రమరాంబ, మల్లిఖార్జున స్వామిని దర్శించుకోనున్నారని తెలిపారు. అనంతరం కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరులో నిర్వహించే జిఎస్‌టి 2.0 బహిరంగ సభకు హాజరవుతారన్నారన్నారు. ప్రధాన మంత్రి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. సభకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని, ఆహారం, తాగునీరు సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం హెలిప్యాడ్, సభ ప్రాంగణం, అప్రోచ్ రోడ్లను, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఐఎఎస్ అధికారి ప్రసన్న వెంకటేష్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్, అన్నమయ్య జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

3 లక్షల మంది బహిరంగ సభకు హాజరు

-12 పార్కింగ్ పాయింట్లు ఏర్పాటు

-జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి

ఈనెల 16న జరిగే ప్రధానమంత్రి బహిరంగ సభకు దాదాపుగా మూడు లక్షల మంది హాజరవుతారని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి పేర్కొన్నారు. అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం సాయంకాలం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి మీడియాతో మాట్లాడుతూ... ఓర్వకల్ ఎయిర్‌పోర్టుకు ప్రధానమంత్రి చేరుకొని అక్కడి నుండి శ్రీశైలం వెళ్లి దర్శనానంతరం నన్నూరు టోల్ ప్లాజా దగ్గర రాగ మయూరి వెంచర్ లో ఏర్పాటు చేసిన సూపర్ జిఎస్‌టి–సూపర్ సేవింగ్స్ బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. ఈ బహిరంగ సభ 40 ఎకరాలలో మూడు లక్షల మంది బహిరంగ సభలో పాల్గొనే విధంగా ఏర్పాటు చేశామన్నారు. 347 ఎకరాలలో 10వేల బస్సులు నిలుపుకునే విధంగా 12 పార్కింగ్ పాయింట్లను గుర్తించామన్నారు. అన్ని పార్కింగ్ పాయింట్లు జాతీయ రహదారికి అనుసంధానం చేసే విధంగా అంతర్గత రహదారులు కూడా నిర్మించడం రేపు సాయంకాలానికి పూర్తవుతుందని తెలిపారు. పబ్లిక్ మీటింగ్ కు వచ్చిన ప్రజలందరికీ 15 లక్షల లీటర్ల తాగునీరు , మజ్జిగ , భోజనం , అవసరమైన వైద్య సదుపాయాలు, టాయిలెట్స్ ఏర్పాట్లు ఉంటాయని తెలిపారు.

'కూటమి' అన్ని విధాలా విఫలం

-వైసిపి రీజినల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి -కోటి సంతకాల పోస్టర్ విడుదల

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అన్ని విధాలా విఫలమైందని వైసిపి రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. కర్నూలు లక్ష్మి ఫంక్షన్ హాలులో వైసిపి జిల్లా సంస్థాగత సమావేశం జిల్లా అధ్యక్షులు ఎస్‌వి.మోహన్ రెడ్డి అధ్యక్షత నిర్వహించారు. ముఖ్య అతిధిగా హాజరైన పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్ని విధాలా విఫలమైందని చెప్పారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టె కోటి సంతకాలు సేకరణలో ప్రతి కార్యకర్త పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైసిపి బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్‌వి మోహన్ రెడ్డి కోరారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటు పరం కాకుండా గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రతి కార్యకర్త సంతకాల సేకరణ నిర్వహించి ఓ ఉద్యమం రీతిలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కాపాడుకుందామని అన్నారు. రాష్ట్రంలో కల్తీ మద్యం విచ్చలవిడిగా దొరుకుతుందని, టిడిపి నేతలే కల్తీ మద్యం అమ్మకానికి పాల్పడి ఆ కల్తీని వైసిపి నేతలపైకి వేసేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. కూటమి నేతల కుట్రలను తిప్పికొట్టి కల్తీ మద్యంపై మహిళలను ప్రజలను చైతన్య పరిచి రానున్న రోజుల్లో కల్తీ మద్యంపై సిబిఐ విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, నగర మేయర్ బివై.రామయ్య, నియోజకవర్గం ఇన్ చార్జీలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

గో బ్యాక్ నరేంద్ర మోడీ

-సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఎక్కడ..?

-కడప స్టీల్ ప్లాంట్ ఎప్పుడు ఏర్పాటు చేస్తారు..?

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఈనెల 16న ప్రధాని నరేంద్ర మోడీ జిల్లా పర్యటనను నిరసిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈనెల 15న జరిగే నిరసన ర్యాలీకి విద్యార్థి యువజన సంఘాలు సంపూర్ణ మద్దతు తెలుపుతూ సిఆర్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సోమన్న, సాయికుమార్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి మహేంద్ర, ఎఐడిఎస్ఒ నాయకులు మల్లికార్జున ఎఐవైఎఫ్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులు అబ్దుల్లా మాట్లాడారు. నరేంద్ర మోడీ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారని, అధికారం చేపట్టి 11 సంవత్సరాలు పూర్తి అయిన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ హామీని అమలు చేయకుండా వెనుకబడిన రాయలసీమ జిల్లాలలో కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని 11 సంవత్సరాలుగా విద్యార్థులను, యువకులను నిర్లక్ష్యం చేస్తూ ఏ ముఖంతో కర్నూలుకు వస్తున్నారని వారు ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ కు అనేక పర్యాయాలు వచ్చిన నరేంద్ర మోడీ అమరావతి నిర్మాణానికి ఒక చెమ్మునీళ్లు, పిడికెడు పట్టి ఇచ్చారన్నారు. డబల్ ఇంజన్ సర్కార్ అధికారం చేపట్టిన తర్వాత విశాఖలో జరిగిన బహిరంగ సభలో డిప్యూటీ జిఎం పవన్ కళ్యాణ్‌కు ఒక చాక్లెట్ ఇచ్చి చేతులు దులుపుకున్నారు తప్ప రాష్ట్ర విద్యార్థులు, యువకుల గురించి ఏమాత్రం మాట్లాడకపోయినా కూటమి నాయకులు ప్రధాని అడగాలంటేనే భయపడిపోతున్నారన్నారు. 2019 ఎన్నికలకు ముందు జిఎస్‌టి వల్ల రాష్ట్రానికి ప్రతి సంవత్సరం రూ.8000 కోట్లు నష్టం జరుగుతుందని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు జీఎస్టీ 2.0 ఉత్సవాలలో ఏ విధంగా పాల్గొంటారని ప్రశ్నించారు. కర్నూలు పర్యటనలో ఆంధ్రప్రదేశ్ రావలసిన ప్రత్యేక హోదా, కడప స్టీల్ ప్లాంట్ స్థాపన, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ నరేంద్ర మోడీని గట్టిగా అడగాలని వారి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న అధికార, ప్రతిపక్ష పార్టీలు రాష్ట్ర ప్రయోజనాల కన్నా ప్రజల బాగోగుల కన్నా వారి అధికారమే పరమావధిగా పని చేస్తున్నారన్నారు. అలాంటి తరుణంలో రాష్ట్ర ప్రజల హక్కుల కోసం వామపక్ష పార్టీలు మోడీ గో బ్యాక్ నినాదంతో అక్టోబర్ 15న కర్నూలు నగరంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నారన్నారు. ఈ నిరసనకు విద్యార్థి యువజన సంఘాలుగా సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామన్నారు.కర్నూలు జిల్లాలో అధిక సంఖ్యలో విద్యార్థులు ,యువకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఎఐఎస్ఎఫ్ నాయకులు ఆలీ, మునిస్వామి, ఎఐవైఎఫ్ నగర అధ్యక్షులు నాగరాజు, నగరనాయకుల శివ, పిడిఎస్ యు జిల్లా సహాయ కార్యదర్శి రమణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

19 మంది ఫుడ్ సేఫ్టీ అధికారుల ఎంపిక

- ప్రధాని పర్యటన ఏర్పాట్లు చకచక

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఈనెల 16న కర్నూలు ఉమ్మడి జిల్లాలో భారత ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆహార భద్రత ప్రమాణాల ఏర్పాట్లను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహక ఏర్పాట్లను చేస్తోంది. ఈ నేపథ్యంలో ఫుడ్ సేఫ్టీ శాఖ 19 మంది అధికారులను ఆహార భద్రత ప్రమాణాల పరిశీలనల నియమిస్తూ శుక్రవారం ఆ శాఖ కమిషనర్ ద్వారా ఉత్తర్వులు జారీ చేసిందని కర్నూలు జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కె.కూర్మా నాయకులు తెలిపారు. అందులో భాగంగా కర్నూలు జిల్లాకు సంబంధించి కర్నూలు, అనంతపురం, కడప, తిరుపతి, ప్రకాశం జిల్లాల్లో నుంచి ఎనిమిది మంది ఎఫ్ఎస్ఒలు, ఒక ఎఎఫ్ఎస్ఒ చిత్తూరు నుంచి పాల్గొన్నారను. నంద్యాల జిల్లాకు సంబంధించి నంద్యాల నరసరావుపేట గుంటూరు బాపట్ల భీమవరం నుంచి ఎనిమిది మంది ఎఫ్ ఎస్ఒలు, కాకినాడ, గుంటూరు నుంచి ఇద్దరు ఎఎఫ్‌సిలు పాల్గొంటారన్నారు. వారు జాయింట్ ఫుడ్ కంట్రోలర్ నేతృత్వంలో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు.

ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

-పలుచోట్ల జెండావిష్కరణలు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్



మాట్లాడుతున్న ఐద్వా గౌరవాధ్యక్షులు పి.నిర్మల

అనంతపురంలో ఈనెల 13, 14, 15 తేదీలలో నిర్వహించే ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలు జయప్రదం చేయాలని శుక్రవారం వివిధ ప్రాంతాలలో మహిళలు ఐద్వా జెండాను ఆవిష్కరించారు. నేతాజీ హౌసింగ్ కాలనీలో సి.రేవతి అధ్యక్షతన కె.పద్మావతి జెండాను ఆవిష్కరించారు. ఇందిరా గాంధీ నగర్‌లో కుమారి అధ్యక్షతన పి.నిర్మల ఆవిష్కరించారు. వీకర్ సెక్షన్ కాలనీ సెంటర్ ముందు ఉన్న ఆఫీసులో శ్యామల అధ్యక్షతన వి.లత ఆవిష్కరించారు. ఐద్వా జిల్లా గౌరవాధ్యక్షులు పి.నిర్మల, జిల్లా అధ్యక్షులు శ్యామల, వి.లతలు మాట్లాడుతూ ఐద్వా రాష్ట్ర మహాసభలలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తీసుకోవాల్సిన అంశాలపై చర్చిస్తారన్నారు. రాబోవు మూడేళ్ళలో ఐద్వా నిర్వహించే కార్యక్రమాలను రూపొందిస్తారని తెలిపారు. ఈ మధ్యకాలంలో మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు, హత్యలు, కుల దురహంకార హత్యలు పెరిగిపోయాయన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తూ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

ఉపాధి ఎపిఒ అక్రమాలపై విచారణ

ప్రజాశక్తి- సి బెళగల్

సి బెళగల్ మండలం ఉపాధి హామీ పథకం ఎపిఒ రామన్న అవినీతి అక్రమాలపై ఆదోని, ఎమ్మిగనూరు క్లస్టర్ ఎపిడిలు లోకేశ్వర్, అలిపీరా శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. మండలంలో కొత్త జాబ్‌కార్డు కోసం రూ.1000 నుండి రూ.3000 వరకు కంప్యూటర్ ఆపరేటర్ సుధాకర్ ద్వారా అక్రమాలకు పాల్పడుతున్నారని వెల్లడయ్యింది. అదే మండలంలో కొంతమంది మేటిలను తమ గుప్పిట్లో పెట్టుకొని కూలీలు రాకున్నా హాజర్లు వేయించి అడ్డదారిలో నగదు పొందుతున్నట్లు ఆరోపించారు. ఇటీవల జరిగిన సామాజిక తనిఖీలో ఉపాధి అక్రమాలు బయట పడగా బహిరంగ సభ రాకముందే కొన్ని ముడుపులు చెల్లించుకొని అక్రమాలను కప్పిపుచ్చినట్లు వార్తలు వచ్చాయి. దీంతో పాటు ఎఫ్ఎలతో కలిసి మందు, విందు, వంటి అసాంగిక కార్యకలాపాలు చేస్తున్నట్లు తేలింది. గ్రామాల్లో తనిఖీలని వెళ్ళినప్పుడు తప్పకుండా విందు ఏర్పాటు చేయాలనీ లేదంటే కొంత ముడుపు ఇవ్వాలని అదీ లేదంటే కూలీల ముందే ఎఫ్ఎలను ఉద్దేశ్య పూర్వకంగా కించపరుస్తున్నట్లు తేలింది. పని ప్రదేశంలో బోర్డుల ఏర్పాటు బాధ్యత తనదేనని చెప్పి ఒక్కో బోర్డుకు రూ.1000 దండుకొన్నారని తెలిసింది.

వికలాంగుడు ఎఫ్ఎ పిర్యాదుతో కదలిక

వికలాంగుడు ఎఫ్ఎ మౌలాలి గౌడ్‌ను అక్రమంగా తొలగిస్తూ ఇస్తారాజ్యంగా సస్పెండ్ కాపీని పంపారు.. తొలగింపు ఆపుతానని చెప్పి రూ.50వేలు డిమాండ్ చేసి బలవంతంగా రూ.30వేలు ఫోన్ పేలో వేయించుకొని తీరా మాట మార్చారు. ఆ గ్రామంలో ఎఫ్ఏ కల్లుగప్పి మేటిల ద్వారా వెసులు బాటు చేసుకొని నకిలీ హాజరు వేసి ఆ తప్పుఎఫ్ఏ పై నెట్టివేసే చర్యకు పాల్పడ్డారు. ఇది బయట పడటంతో మౌలాలి గౌడ్‌ను ఎపిఒ దూశించగా ఫిర్యాదుతో బాగోతం అంతా వెలుగు చూసింది. శుక్రవారం తగు నివేదిక తయారు చేసి పిడికి పంపుతున్నామని, ఇక చర్యలపై ఉన్నత అధికారుల నిర్ణయమని విచారణ అధికారులు మీడియాకు తెలిపారు.

నిధులు, నీళ్ల ప్రస్తావన లేని మోడీ పర్యటన దేనికి?

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఈనెల 16న కర్నూలు జిల్లా పర్యటనకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వస్తున్నట్లు ఊదర కొడుతున్నారని, ఇచ్చిన హామీ ఒక్కటి నెరవేర్చకుండా ఏ మొహంతో కర్నూలుకు వస్తారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. ప్రభాకరరెడ్డి విమర్శించారు. శుక్రవారం సిపిఎం జిల్లా కమిటి సమావేశం కర్నూలు సుందరయ్య భవన్‌లో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్. రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. కె. ప్రభాకర రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయి మాట్లాడారు.11 సంవత్సరాల నరేంద్ర మోడీ పరిపాలనలో ఆంధ్ర రాష్ట్రానికి ఏ కోశానా పనిచేయలేదన్నారు. విభజన హామీల అమలు, ప్రత్యేకహోదా, వెనకబడ్డ ప్రాంతాలకు , రాయలసీమ అభివద్ధికి నిధులు అనే వాటి ఊసే లేదన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపలేదని, రాయలసీమ హక్కుగా ఉన్న కడప ఉక్కు మాటే లేదన్నారు. మరి ఏ మొహం పెట్టుకుని కర్నూలుకు వస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కర్నూలులో ఏర్పాటు చేస్తామన్న హైకోర్టు పోయింది, బెంచ్ మాయమైందన్నారు. పేదలైన పసిపిల్లలు తాగే పాల డబ్బా నుండి కార్పొరేట్ కంపెనీల దాకా ఉసురు తీసే జిఎస్‌టిని వేసి, పీల్చి పిప్పి చేసి నేడు తగ్గించామంటూ తగుదునమ్మా అంటూ సభలు పెట్టడం ఎవరిని మోసం చేయడానికని అన్నారు. ఇప్పటికైనా పర్యటన సందర్భంగా కర్నూలు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కోసం మాట్లాడండని హితువు పలికారు. ఇప్పటికే ఓర్వకల్ ప్రాంతంలో పది సంవత్సరాల క్రితం 30 వేల ఎకరాల భూమిని తీసుకున్నారన్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంత ప్రజానీకానికి ఉపాధినిచ్చే పరిశ్రమలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజాధనంతో ఒకరినొకరు భజన చేసుకునే ఈ ప్రధాని పర్యటనను ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.నిర్మల, ఎండి. ఆనంద్‌బాబు, జి.రామకృష్ణ, వెంకటేశ్వర్లు, టి.రాముడు, ఎండి.అంజిబాబు, జిల్లా కమిటి సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి

బిఇడి కళాశాలలపై చర్యలుతీసుకోవాలి

కర్నూలు కలెక్టరేట్ : ధనార్జనే ధ్యేయంగా ఉన్న బిఇడి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర బాబు డిమాండ్ చేశారు.ఆర్‌యు వీసీ వెంకట బసవ రావుకు పిడిఎస్‌యు నాయకులు వినతిపత్రం అందజేశారు.

టౌన్ మోడల్ లో సమస్యలు పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

కర్నూలు కలెక్టరేట్ : టౌన్‌మోడల్ కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరిం చాలని ఎస్ఎఫ్ఐ నగర నాయకులు సాయి యాదవ్, ప్రదీప్ డిమాండ్ చేశారు. శుక్రవారం టౌన్ మోడల్ కళాశాలలో వారు మాట్లా డుతూ విద్యార్థులకు తాగునీరు సౌకర్యం లేదన్నారు. తరగతి గదిలో విద్యుత్ లైట్లు ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని కోరారు.

మానసిక వికలాంగుల హక్కులను కాపాడాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మానసిక వికలాంగులకు కూడా సమాన హక్కులు ఉంటామని, వారి హక్కులకు బంగం కలుగకుండా కాపాడాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లాలా వెంకటశేషాద్రి అన్నారు. కర్నూలు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కర్నూలు లోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లోని మానసిక ఆరోగ్యవార్డును సందర్శించారు. అక్కడ ఉన్న మానసిక వికలాంగులకు ఆపిల్ పండ్లను పంచిపెట్టారు. మానసిక వికలాంగులను చూసుకునే తల్లితండ్రులకు, ఇతర పరిచారకులకు మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తుల ఆరోగ్య సంరక్షణ హక్కు, ఆస్తి హక్కు మొదలైనవాటితో సహా మానసిక రోగుల హక్కులు , మానసిక రోగులను రక్షించడం , వైద్య చికిత్స అందించడం వంటి విధుల గురించి వివరించారు. మనిషి ఆలోచనలు, భావోద్వేగాలు నియంత్రణలో ఉంచుకోగలిగితే మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. మానసిక వికలాంగులకు కూడా సమాజంలో మిగతా వారి లాగానే జీవించే హక్కు ఉందని పేర్కొన్నారు. మానసిక వికలాంగుల హక్కులకు భంగం కలిగితే వారిపై కఠిన చర్యలు కలవని తెలిపారు. మానసిక ఆరోగ్యం బాగా లేని వారికి వైద్య చికిత్సలు నిర్వహిస్తే ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. మానసిక వికలాంగులకు ఏవిధమైన న్యాయ సహాయం కావాలన్నా కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే ఉచిత న్యాయ సహాయంను అందిస్తామన్నారు. లేదా 15100 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి అయినా న్యాయ సహాయం పొందవచ్చన్నారు. NALSA (మానసిక అనా రోగ్యం , మేధో వైకల్యం ఉన్న వ్యక్తులకు న్యాయ సేవలు) పథకం, 2024 గురించి తెలిపారు. మానసిక ఆరోగ్య హెచ్ఒడి డాక్టర్‌నాగేశ్వరావు,ఎండోక్రైనాలజీ విభాగపు అధిపతి డాక్టర్ శ్రీనివాసులు, సైకియాట్రిస్ట్ డాక్టర్ చైతన్యకుమార్, డాక్టర్ యతిరాజు, లీగల్ సర్వీసెస్ యూనిట్ నెంబర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు సంభందిత వైద్యాధి కారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతికళ

మానసిక ఆరోగ్య సమస్యల పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో సిబ్బంది, ఆషా కార్యకర్తలతో మానసిక ఆరోగ్య సమస్యల పై అవగాహన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.శాంతికళ జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం జరుపుకుంటున్నామని, నిరాశతో కూడిన భావాలు అధికంగా కనిపించడం, గుండెలోదడ, ప్రవర్తనలోపం, చదువులో వెనుకబడిపోవడం, రకరకాల భయాలు, నిద్రలేమి, ఆరోగ్య సమస్యలు, అనవసర ఒత్తిడి, భయం, నిరుత్సాహం, ఆత్మవిశ్వాసం కోల్పోవడం ఇలాంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేస్తే మానసిక సమస్యగా మారే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్.భాస్కర్ మాట్లాడుతూ తల్లితండ్రులు కుటుంబ సభ్యులు, పిల్లల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉండాలని, నిత్యం సంభాషించుకోవాలని తెలిపారు. ఆత్మహత్యల నివారణకు టెలిమానస్ టోల్ ఫ్రీ నంబర్ 14416 ను సంప్రదించి నిపుణుల ద్వారా ఉపశమనం పొందవచ్చునన్నారు. ఆయావిభాగాల వైద్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నవంబర్ 12న ఆర్‌యు స్నాతకోత్సవం


ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ విశ్వవిద్యాలయ నాల్గవ స్నాతకోత్సవం నవంబర్ 12న నిర్వహిస్తున్నట్లు వైస్‌ఛాన్సలర్ ఆచార్య వి.వెంకట బసవరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరం కోర్సుల్లో అర్హత సాధించిన విద్యార్థులు ఈనెల 11 నుండి 25 వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తుచేసుకోవాలన్నారు. నాల్గవ స్నాతకోత్సవానికి సంబంధించి 04.09.2023 సెప్టెంబర్ 4 నుంచి మరియు ః2024 మే 15 తేదీల్లో యూనివర్సిటీ జారీచేసిన ప్రకటనకు స్పందనగా దరఖాస్తుచేసుకున్నవారు మళ్లీ దరఖాస్తు చేయనవసరం లేదని ఆయన వివరించారు.

డిప్లమా కోర్సుల మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

అలైడ్ హెల్త్ సైన్సెస్ (పారా మెడికల్)కు సంబందించిన 10 డిప్లమా కోర్సులకు మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తయిందని కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ కె. చిట్టి నరసమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ కం రోస్టర్ ప్రకారం సీట్లు భర్తీ చేశామన్నారు. 18న రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. పూర్తి వివరాలకు వెబ్ సైట్ ను సంప్రదించాలని తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయి సుధీర్, పథాలజీ హెచ్ఒడి డాక్టర్ బాలేశ్వరి, ఎడి.మల్లేశ్వరి, ఆఫీస్ సూపరిండెంట్ హరి శంకర్‌రావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్, జూనియర్ అసిస్టెంట్ హరి ప్రసాద్, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆదోనిలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నేటి నుంచి 'బోధనేతరం' బహిష్కరణ : ఫ్యాప్టో

ప్రజాశక్తి - ఆదోని

బోధనేతర కార్యక్రమాలతో పాఠశాలల్లో బోధన కుంటుపడుతోందని, శనివారం నుంచి బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నామని ఫ్యాప్టో నాయకులు తెలిపారు. శుక్రవారం డిప్యూటీ డిఇఒ వెంకటరమణ రెడ్డి, ఎంఇఒలు భూపాల్ రెడ్డి, శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు నాగరాజు, జి.వీరచంద్ర యాదవ్, గాదిలింగప్ప, మహాదేవప్ప, శ్రీనివాసులు, సుంకన్న మాట్లాడారు. మితిమీరిన బోధనేతర కార్యక్రమాల వల్ల బోధన సమయం హరించుకుపోతోందని, ఉపాధ్యాయులకు కూడా బోధనపై ఆసక్తి తగ్గిపోయే విధంగా బోధనేతర కార్యక్రమాలు పెరిగిపోయాయని తెలిపారు. డిజిటల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు చేయాల్సిన ఆన్‌లైన్ పనులను ఉపాధ్యాయులతో చేయించడం ఏమిటని ప్రశ్నించారు. ఫ్యాప్టో నాయకులు సుధాకర్, ముత్యాల, రామకృష్ణ, నాగేంద్ర, మల్లికార్జున, సూర్యుడు, నారాయణ పాల్గొన్నారు. గోనెగండ్ల మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఇఒ నీలకంఠ వినతిపత్రం అందజేశారు. ఫ్యాప్టో నాయకులు గంగాధర్, కిశోర్, గుమ్మల బాబు, రహంతుల్లా, నరసింహులు, మౌలాలి, నాయకులు నరసింహ, అక్బర్, మౌలాలి, నాగరాజు, రఘవేంద్ర పాల్గొన్నారు.

నేడు సిపిఎం నూతన కార్యాలయం ప్రారంభం

- హాజరు కానున్న మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని తేరు బజారులో పద్మశాలి కల్యాణ మండపం వద్ద శనివారం సిపిఎం నూతన కార్యాలయం (కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య భవన్) ప్రారంభిస్తున్నట్లు సిపిఎం నాయకులు గోవిందు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, సిపిఎం సీనియర్ నాయకులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, రైతుసంఘం జిల్లా నాయకులు సి.హనుమంతు హాజరవుతారని తెలిపారు.

'విజయవాడ ధర్నాను జయప్రదం చేయండి'

ప్రజాశక్తి - హాలహర్వి

ఈ నెల 13, 14, 15వ తేదీల్లో విజయవాడలో జరిగే ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు కెపి.నారాయణ స్వామి తెలిపారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విఆర్ఎలకు రాష్ట్ర విభజనకు మందు కనీస వేతనం రూ.15 వేలకు పెంచుతామన్న హామీ నేటికీ నెరవేరలేదని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం ఆ హామీని నెరవేర్చకపోయినా డిఎని కూడా ఎత్తేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వమైనా డిమాండ్లను అమలు చేయాలని కోరారు. విజయవాడలో సిఐటియు ఆధ్వర్యంలో ఈనెల 13, 14, 15వ తేదీల్లో చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని తెలిపారు. తిమ్మప్ప, బసవరాజు, మల్లికార్జున, ఈరన్న, అంజి, దుర్గప్ప, కిషోర్, ఉమాకాంత్ పాల్గొన్నారు.

పిఎం పర్యటన విజయవంతానికి కృషి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - చిప్పగిరి

ఈనెల 16న భారత ప్రధాని నరేంద్ర మోడీ వస్తున్న నేపథ్యంలో పర్యటన విజయవంతానికి అధికారులు కృషి చేయాలని ఎంపిడిఒ అల్లా బకాష్ సూచించారు. శుక్రవారం మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడారు. మండలానికి కేటాయించిన బస్సుల్లో పొదుపు మహిళలను, ప్రజలను తరలించే విధంగా సచివాలయ సిబ్బంది, అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఒక్కో బస్సుకు సచివాలయ అధికారులే దగ్గరుండి మహిళలను తీసుకెళ్లి మళ్లీ వచ్చి ఇక్కడకు చేర్చే వరకు అధికారులు చూసుకోవాలన్నారు. ఎక్కడ ఏ అవాంతరాలు ఎదురవకుండా చూసుకునే బాధ్యత మీపై ఉందన్నారు. పరిపాలనాధికారి శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపిడిఒ నాగరాజు, ఎపిఎం శివయ్య, ఏపీవో జుబేర్ అహ్మద్ పాల్గొన్నారు.

ఎస్ఐని కలిసిన గురురాజ్ దేశాయ్

ప్రజాశక్తి - నందవరం



నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎమ్మిగనూరు ఎస్ఐ చిరంజీవిని దేశాయ్ నెట్‌వర్క్ అధినేత గురురాజ్ దేశాయ్ శుక్రవారం కలిశారు. ప్రజలకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. గ్రామాల్లో శాంతిభద్రతలను కాపాడాలని తెలిపారు. మాజీ సర్పంచి రామన్న గౌడ్, కె.శివ, దానియేల్, సోషల్ మీడియా కన్వీనర్ దండు వీరేష్ పాల్గొన్నారు.

బాధితునికి పరామర్శ : మండలంలోని మిట్టసోమాపురం గ్రామంలో రామలింగడును పరామర్శించారు. రామలింగడు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఎమ్మిగనూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

నాణ్యత డొల్ల..!

- నత్తనడకన బైపాస్ పనులు
- అధికారుల పర్యవేక్షణ కరువు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని హైవే బైపాస్ నిర్మాణం ఆదోని ప్రజల చిరుకాల వాంఛ. పట్టణంలో ఇరుకు రోడ్డులో ప్రజలు నిత్యం ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్నారు. హైవే నిర్మాణం పూర్తయితే బళ్లారి, ఆలూరు, బెంగళూరు వెళ్లే వాహనాలు పట్టణంలోకి భారీ వాహనాలు రాకుండానే వెళ్తాయి. ఇప్పటికీ రోడ్డు నిర్మాణం పూర్తి కాకపోవడంతో ప్రజల కల నెరవేరడం లేదు.

ఆదోని పట్టణం మీదుగా జరుగుతున్న హైవే బైపాస్ రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు నిర్ణీత గడువులోపు పూర్తి చేస్తామని చెప్పిన అధికారులు వివిధ కారణాలు చూపుతూ అప్పుడప్పుడు పనులు చేపడుతున్నారు. పనులను పరివేక్షించి జోరు పెంచాల్సిన అధికారుల జాడ కరవడంతో ఇప్పటికీ రోడ్డు నిర్మాణం పూర్తికాలేదు. మంత్రాలయం, ఎమ్మిగనూరు మీదుగా ఆదోని నుంచి రోడ్డుకు కలిసే విధంగా 2022 ఫిబ్రవరిలో అప్పటి ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి భూమిపూజ చేశారు. రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.250 కోట్లు అవసరమని అధికారులు ప్రకటించారు.



రైల్వే ట్రాక్‌పై పూర్తికాని పనులు

జాతీయ రహదారి, బైపాస్ నిర్మాణం ఇలా...

ఎమ్మిగనూరు రోడ్డులోని 40 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద, నెట్టేకల్ క్రాస్ పక్క హంస ఎస్టేట్, కమల ఎస్టేట్, సులోచనమ్మ గార్డెన్, సింధు ఎస్టేట్, బిందు ఎస్టేట్, మంజునాథ ఎస్టేట్, రాఘవేంద్ర ఎస్టేట్, వెంకటాద్రి ఎస్టేట్‌తో పాటు నాన్ లే అవుట్ వెంచర్ల మీదుగా జాతీయ రహదారి బైపాస్ నిర్మాణం జరుగుతోంది. ఎమ్మిగనూరు రోడ్డు నుంచి పత్తికొండ రోడ్డు రైల్వే ట్రాక్ మీదుగా ఆలూరు రోడ్డులో కలిసేలా ఆదోని బైపాస్ 7.3 కిలోమీటర్ల పొడవు ఉంది.

ట్రాఫిక్‌తో ఇబ్బందులు

- నూర్ అహ్మద్, ఎంహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి



ఆదోని పట్టణం వెలుపల ప్రత్యామ్నాయ రోడ్డు లేదు. ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ఆర్ట్స్ కళాశాల నుంచి శ్రీనివాస భవన్ వరకు మున్సిపల్ మెయిన్ రోడ్డు ఎప్పుడూ రద్దీగానే ఉంటుంది. బళ్లారి, ఆలూరు వైపు వెళ్లే వాహనాలు ఆదోని గుండానే వస్తున్నాయి. హైవే పూర్తయితే భారీ వాహనాలు అలాగే వెళ్లి ట్రాఫిక్ తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం రోజూ వాహనాల రద్దీతోనే ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. అధికారులు చొరవ తీసుకొని కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చి రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.

పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ 70 శాతం పనులు పూర్తయినట్లు సమాచారం. పత్తికొండ రోడ్డులోనే బ్రిడ్జి నిర్మాణం పూర్తి దశలో ఉన్నప్పటికీ అక్కడి నుంచి గుంతకల్లు వైపు వెళ్లే రైల్వే ట్రాక్ వరకు ఇంకా 2 కిలోమీటర్ల బిటి వేయాల్సి ఉంది. రైల్వే ట్రాక్‌పై ప్రస్తుతం రూఫ్ లెవల్‌లో ఇనుప స్తంభాల అమరిక జరిగిందని, ప్రస్తుతం 5.2 కిలోమీటర్ల రోడ్డు వేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఆదోని పట్టణం నుంచి ట్రాఫిక్‌ను మళ్లించడానికి హైవే బైపాస్ రూపొందించారు. రద్దీని తగ్గించి, రహదారి భద్రతను మెరుగుపరచడమే లక్ష్యంగా పెట్టుకున్నా సకాలంలో పూర్తికావడం లేదు. ప్రాజెక్టు వ్యయం రూ.242 కోట్లు. రోడ్డు నిర్మాణానికి రూ.98 కోట్లు. రోడ్డుకు కావాల్సిన 54.8 ఎకరాల భూసేకరణకు దాదాపు రూ.125.5 కోట్లు కేటాయించారని అధికారులు చెబుతున్నారు.

అధికారులు పర్యవేక్షించాలి

- లక్ష్మణ్, సిపిఎం పట్టణ కార్యదర్శి



హైవే బైపాస్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులను హైవే అథారిటీ అధికారులు పర్యవేక్షణ చేయడం లేదు. పనులు మొదలైన రెండేళ్లకే అక్కడక్కడ కంకర తేలింది. నిర్ణీత గడువులోపు పనులు పూర్తి చేయాల్సిన వారు కారణాలు చెబుతూ నిర్లక్ష్యం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయి. రైల్వే బ్రిడ్జి వద్ద పనులు నాణ్యత లేనట్లు తెలిసింది. ఉన్నతాధికారులు పరిశీలించి పనులు పటిష్టంగా ఉండేలా చూడాలి. ప్రజల సౌకర్యార్థం సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయించాలి. ట్రాఫిక్ సమస్య తీరే దిశగా అధికారులు చొరవ తీసుకోవాలి. లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతాం.

అక్కడక్కడ కుంగిన రోడ్డు

రోడ్డు కింద భాగాన నల్ల రేగడి కావడం వల్ల ఆలూరు రోడ్డు నుంచి రైల్వే ట్రాక్ వరకు జరిగిన రోడ్డు నిర్మాణంలో అక్కడక్కడ కుంగిపోయింది. రైల్వే వంతెనపై నిర్మిస్తున్న బ్రిడ్జికి సపోర్ట్‌గా వేస్తున్న సిమెంటు బండలు వదులుగా ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రారంభం కాకముందే ఇలా అయితే ఎలా అంటూ, కాంట్రాక్టర్ శ్రద్ధ చూపాలంటూ పలువురు విమర్శిస్తున్నారు. ప్రారంభానికి ముందే రోడ్డు కంకర తేలిందని, తారు మందంగా లేదని ఇటీవల సిపిఎం నాయకుల బృందం పనులు పరిశీలించిన సమయంలో నాణ్యత లోపం బయటపడింది.

పత్తి పంట చోరీ

ప్రజాశక్తి - కోసిగి



పత్తి పంటను దొంగిలించిన సంఘటన మండలంలోని దేవరబెట్ట గ్రామంలో చోటు చేసుకుంది. మండలంలోని దేవరబెట్ట పొలాలకు సంబంధించి కోసిగి రైతు నాగన్న గేరి కోసిగయ్య 1.50 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. చేతికొచ్చిన పత్తి పంటను గురువారం రాత్రి గుర్తు తెలియని దొంగలు దొంగలించారు. బుధవారం సాయంత్రం పొలానికి వెళ్లి చూసి ఉదయం పత్తి విడిపించడానికి కూలీలతో పొలానికి వెళ్లారు. పత్తి మొక్కలు ఖాళీగా ఉండడం చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతు తెలిపారు. మండలంలో ఇళ్లల్లో దొంగతనాలు చేయడమే కాకుండా, పొలాల్లో కూడా దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు పూర్తిస్థాయి విచారణ చేపట్టి రైతుకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జిఎస్‌టి ప్రయోజనాలు తెలుసుకోవాలి

- డివిజన్ జిఎస్‌టి అధికారి నాయక్

ప్రజాశక్తి - మంత్రాలయం

కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జిఎస్‌టి ద్వారా పొందిన ప్రయోజనాలను ప్రజలు తెలుసుకోవాలని డివిజన్ జిఎస్‌టి అధికారి నాయక్ సూచించారు. శుక్రవారం స్థానిక సచివాలయం-2లో ఎంపిడిఒ నూర్జహాన్ అధ్యక్షతన జిఎస్‌టిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిఎస్‌టి తగ్గింపులో భాగంగా ఎలక్ట్రానిక్స్ వస్తువులు టివి, ఫ్రిజ్, ఏసీ, ఎయిర్ కూలర్, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గడం వల్ల మధ్య తరగతి ప్రజలకు కాస్త ఆర్థిక ఉపశమనం కలిగిందని పేర్కొన్నారు. జిఎస్‌టిపై ప్రతి ఒక్కరూ అవగాహన ఉండాలని చెప్పారు.

ఉపాధ్యాయునిపై విద్యార్థి తండ్రి దాడి

- నాలుగేళ్ల క్రితం విద్యార్థిని దండించాడని బదిలీ రోజు ఘటన

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని గాజులదిన్నె గ్రామంలో ప్రాథమిక పాఠశాల (ఎస్సీ)లో జిసి.బసవరాజు 8 ఏళ్లుగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయుడు పనితీరుని గుర్తించి జిల్లా విద్యాధికారులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి ఉపాధ్యాయ దినోత్సవం రోజున కలెక్టర్, మంత్రి చేతులమీదుగా అవార్డు అందజేశారు. పాఠశాలలో హర్షవర్ధన్ అనే విద్యార్థి నాలుగో తరగతి చదువుతున్నాడు. నాలుగేళ్ల క్రితం తన కుమారుని బసవరాజు దండించాడని కక్ష పెంచుకున్న బాలుని తండ్రి మీసాల రంగస్వామి ఉపాధ్యాయుని కోసం కాపు కాశాడు. శుక్రవారం పాఠశాల ప్రారంభం సమయంలో మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై పాఠశాలకు వస్తున్న ఉపాధ్యాయుడు బసవరాజు పాఠశాల వద్ద దిగగానే వెంట తెచ్చుకున్న కర్రలతో రంగస్వామి విచక్షణారహితంగా దాడి చేశాడు. దాడిలో ఉపాధ్యాయుని తల, ముక్కు, చేతులకు గాయాలయ్యాయి. గాయపడిన ఉపాధ్యాయునితో ఎంఇఒలు రామాంజనేయులు, నీలకంఠ, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు గుమ్మల బాబు, రవి, బతకన్న, రహమతుల్లా కలిసి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కన్నీరు పెట్టిన విద్యార్థులు : మండలంలోని గాజులదిన్నె ప్రాథమిక ఎస్సీ పాఠశాలలో 8 ఏళ్లుగా ఉన్నతమైన విద్యా సేవలు అందించిన ఉపాధ్యాయునిపై విద్యార్థి హర్షవర్ధన్ తండ్రి దాడి చేయడంతో గాయపడిన తమ ఉపాధ్యాయుని చూసి విద్యార్థులు కన్నీరు పెట్టారు. తమ ఉపాధ్యాయునికి న్యాయం చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరారు.

నిందితుని కఠినంగా శిక్షించాలి : సుదీర్ఘకాలంగా గాజులదిన్నె లాంటి గ్రామీణ పాఠశాలలో పనిచేస్తూ ఉత్తమ బోధన అందించి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొంది బదిలీపై వెళ్తున్న బసవరాజుపై దాడి చేయడం అనాగరికమని, దాడికి పాల్పడిన విద్యార్థి హర్షవర్ధన్ తండ్రి మీసాల రంగస్వామిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుమ్మల బాబు, పిఆర్‌టియు నాయకులు రవి, ఎపిటిఎఫ్ సీనియర్ నాయకులు రహంతుల్లా, ఎస్‌టియు నాయకులు బతకన్న డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న నాయకులు

మెడికల్ కళాశాల కోసం... కదం తొక్కిన విద్యార్థులు

- సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు బైఠాయింపు

ప్రజాశక్తి - ఆదోని

మెడికల్ కళాశాల కోసం విద్యార్థులు కదం తొక్కారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరించడం తగదంటూ గళమెత్తారు. ఆదోని ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రభుత్వ ఆధీనంలోనే నిర్మించాలని ముక్తకంఠంతో నినదించారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మిగనూరు రోడ్డులో ఉన్న టర్నింగ్ వద్ద నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు విద్యార్థి సంఘాల జెఎసి ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీగా చేరుకున్నారు. అక్కడ బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మెడికల్ సాధన కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు మాట్లాడారు. ప్రభుత్వ వైద్య విద్యను చదవాలనుకునే విద్యార్థుల ఆశలను కూటమి ప్రభుత్వం ఛిద్రం చేస్తోందని విమర్శించారు. మెడికల్ కళాశాల సాధన కమిటీ గౌరవాధ్యక్షులు దేవిశెట్టి ప్రకాష్, షాబీర్ బాష, కో కన్వీనర్ దస్తగిరి, అఖండ, సోమశేఖర్, తిరుమలేష్, బాలు, రమేష్, శ్రీనాథ్, వెంకటేష్ మాట్లాడుతూ... ఆదోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా భవిష్యత్తులో కలిసికట్టుగా పోరాటం చేస్తామని తెలిపారు. ప్రయివేటీకరణతో పేదలకు వైద్యమందే పరిస్థితి ఉండదని, ప్రభుత్వమే వైద్య కళాశాలను నడపాలని డిమాండ్ చేశారు. పిపిపి విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం వైద్య విద్య ప్రయివేటీకరణ ఆలోచనలను వెనక్కి తీసుకోవాలని, ఎన్ఎంసికి రాసిన లేఖను వెనక్కి తీసుకోవాలని, సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని రద్దు చేస్తామని ఇచ్చిన హామీని అమలు పరచాలని కోరారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారి గోపాల్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు శ్రీనిత్, సంజయ్, ఉమాకాంత్, శశి, అరుణ్, రాజు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు బైఠాయించిన విద్యార్థి సంఘాల నాయకులు

మెడికల్ కళాశాల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ

- ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - దేవనకొండ

రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే బి.విరుపాక్షి తెలిపారు. శుక్రవారం దేవనకొండ క్రాస్ రోడ్డులో జడ్‌పిటిసి కిట్టు, ఎంపిపి లక్ష్మీదేవి భర్త లుముంబా, వైసిపి మండల నాయకులు దివాకర్ నాయుడు, వైసిపి ఆస్పరి మండల నాయకులుతో కలిసి కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణను విరమించే వరకు పేదల తరపున పోరాడతామని, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను తీసుకొస్తే వాటిని ప్రయివేటీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని విమర్శించారు. పిపిపి విధానం పేరిట దాదాపు రూ.లక్ష కోట్ల విలువ చేసే ప్రభుత్వ వైద్య కళాశాలలు, వేలాది ఎకరాల భూములను కట్టబెట్టేందుకు చంద్రబాబు చేస్తున్న చీకటి బాగోతాన్ని నిలదీస్తామని తెలిపారు. ఈనెల 10 నుంచి నవంబర్ 22 వరకు కోటి సంతకాల సేకరణ, 28న నియోజకవర్గంలో ర్యాలీలు, నిరసనలు, ధర్నాలు చేపట్టి ఆర్‌డిఒలు, తహశీల్దార్లకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. నవంబర్ 12న కర్నూలులో అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ రాష్ట్రస్థాయి నాయకులు, సమన్వయకర్తలు కలిసి ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. నవంబర్ 23న అన్ని నియోజకవర్గాలకు సంబంధించి కోటి సంతకాల సేకరణ పూర్తి చేసి 24న పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపుతామన్నారు. 26న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో పార్టీ నాయకులతో కలిసి గవర్నర్‌కు అందజేస్తామని తెలిపారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని వైసిపి కార్యాలయం వద్ద వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక, వైసిపి సీనియర్ నాయకులు బుట్టా శివ నీలకంఠ, రాష్ట్ర పార్టీ పార్లమెంట్ సెక్రటరీ ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, కెఆర్.మురహరి రెడ్డి, మండల అధ్యక్షులు బిఆర్.బసిరెడ్డి, నాయకులతో కలిసి కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం గోడపత్రికను ఆవిష్కరించారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, వైసిపి పట్టణ అధ్యక్షులు కామర్తి నాగేశప్ప, యువజన నాయకులు కదిరికోట సునీల్ కుమార్, రమేష్, మల్లి పాల్గొన్నారు.



దేవనకొండలో గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు



ఎమ్మిగనూరులో గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

మనేకుర్తిలో చోరీ

- 6 తులాల బంగారు, 10 తులాల వెండి అపహరణ

ప్రజాశక్తి - ఆలూరు



ఎస్ఐ చంద్రశేఖర్ విచారణ

మండలంలోని మనేకుర్తి గ్రామంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న కోతి పెద్ద లింగయ్య ఇంట్లో శుక్రవారం చోరీ జరిగింది. 6 తులాల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి దొంగలించినట్లు బాధితురాలు కోతి లక్ష్మి పోలీసులకు తెలిపారు. ఇంట్లో భార్యభర్తలు ఉంటారు. బుధవారం భర్త లింగయ్య పని మీద ఊరికి వెళ్తొస్తానని చెప్పి వెళ్లారు. ఊరిలో బంధువులు చనిపోగా భార్య బంధువులు ఇంటి దగ్గర ఉండి పాత ఇంట్లో ఉన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఇంటికొచ్చి చూడగా ఇంటి తలుపులు, ఇంట్లో బీరువా పగలగొట్టి బంగారు, వెండి దొంగలించినట్లు గుర్తించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

చదువుతో ముందుకు సాగాలి : సిడిపిఒ వరలక్ష్మి

ప్రజాశక్తి - కర్నూలు క్రైం



మాట్లాడుతున్న అధికారులు

బాలికలు చదువు పట్ల శ్రద్ధ వహించి, బాగా చదువుకుని బంగారు భవిష్యత్తు లక్ష్యంగా ముందుకు సాగాలని ఐసిడిఎస్ సిడిపిఒ వరలక్ష్మి, దీవమ్మ తెలిపారు. శుక్రవారం కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలోని కస్తూరిబా పాఠశాలలో 'భేటీ బచావో.. భేటీ పడావో' నిర్వహించారు. వారు మాట్లాడుతూ... బాలికలు కౌమార దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. సూపర్‌వైజర్ పద్మావతి, జెరీనా, విజయలక్ష్మి, అంగన్వాడీలు రమాదేవి, రవిచంద్ర కుమారి, ఎం.వరలక్ష్మి పాల్గొన్నారు.

మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం



మాజీ మంత్రి, వైసిపి నాయకులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం కర్నూలులో వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్వీ.మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన వైసిపి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పెద్దిరెడ్డిని ప్రదీప్‌రెడ్డి కలిశారు. జిల్లా అధ్యక్షులు ఎస్వీ.మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదోని మాజీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యులు పురుషోత్తం రెడ్డి, మండల ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, బూదూరు లక్ష్మి నారాయణ రెడ్డితో కలిసి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని సన్మానించారు. రాష్ట్రస్థాయి కమిటీలో నియోజకవర్గానికి పదవులు కేటాయించడంతో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, రాంపురం రెడ్డి సోదరుల తరపున పురుషోత్తం రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

టిడిపి సభ్యత్వ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - దేవనకొండ


టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకు శుక్రవారం టిడిపి దేవనకొండ కార్యాలయ ఆవరణలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, టిడిపి మండల కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. టిడిపి బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుతో పని చేయాలన్నారు. టిడిపి మండల నాయకులు ఉచ్చీరప్ప, రామారావు నాయుడు, మల్లికార్జున గౌడ్, గిడ్డయ్య గౌడ్, రాజశేఖర్ గౌడ్, రాజగోపాల్ గౌడ్, మల్లేపల్లి రంగుడు, కాకర్ల శాంతి కుమార్, కోటకొండ ముని, భాస్కర్, నాగరాజు గౌడ్, ఆకుల వీరేష్, రాజా సాహెబ్, పెద్దయ్య, కుక్కల తిమ్మయ్య, బాల రంగుడు, తెర్నేకల్ చిన్న వెంకప్ప, బాట మీద రాజు, కోలంట్ల తిమ్మప్ప, బాలకృష్ణ, కుమార్, రాముడు, బంటుపల్లి ఉమేష్ పాల్గొన్నారు.



సభ్యత్వ కార్డులు పంపిణీ చేస్తున్న బొజ్జమ్మ

ఎంబిబిఎస్ విద్యార్థికి అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



అభినందనలు తెలుపుతున్న జీవన్ సుశీల్

పట్టణానికి చెందిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కాలనీలో నివాసముంటున్న సీనియర్ రిపోర్టర్ ఎస్.రాజేష్ బాబు కుమార్తె ఎస్.క్రాంతి నెల్లూరు నారాయణ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించడంతో టిడిపి నేత, ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ (ఎఐసిసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు తనయుడు మల్లెల జీవన్ సుశీల్ అభినందనలు తెలిపారు. శుక్రవారం మల్లెల జీవన్ సుశీల్‌తో పాటు మాతృశ్రీ మెడికల్ ఎమ్‌డియు గంగాధర్ గృహానికి వెళ్లి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రాంతి ఎంబిఎస్ పూర్తి చేసి పేదలకు సేవ చేసి వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. మల్లెల గ్రూప్స్ అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు.

అభివృద్ధిని ఓర్వలేకే వైసిపి విష ప్రచారం

- టిడిపి మండల కన్వీనర్ ఖాసీంవలీ

ప్రజాశక్తి - నందవరం

కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి ఓర్వలేకనే వైసిపి విషప్రచారం చేస్తోందని టిడిపి మండల కన్వీనర్ ఖాసీంవలీ విమర్శించారు. శుక్రవారం నందవరం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. టిడిపి గ్రామ అధ్యక్షులు భీమశేఖర్, వడ్డే గోపాల్, కైరవాడి వీరేష్, గజేంద్ర నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడరాఉ. వైసిపి నాయకులు కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. వారి మాయ మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని చెప్పారు. 'బాబు ష్యూరిటీ -మోసం గ్యారంటీ' పేరుతో ప్రజలకు వైసిపి నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి 'అమ్మఒడి' ఇస్తామని చెప్పిన జగన్ ఒక్కరికి మాత్రమే ఇచ్చారని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఒక్కరికీ 'తల్లికి వందనం' ఇచ్చిందని తెలిపారు. ఎవరిది మోసమో ప్రజలు గమనించాలని కోరారు.

అభివృద్ధికి కూటమి బాటలు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మండలాభివృద్ధికి బాటలు వేసిందని తెలిపారు. మండలంలో రైతుల సంక్షేమం కోసం 100 మినీ గోకలాలను నిర్మించినట్లు చెప్పారు. రూ.4 కోట్లతో సిసి రోడ్లు నిర్మించామని తెలిపారు. పేట గ్రామంలో రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు విడుదల చేయించిన ఘనత కూటమిదని చెప్పారు. పూలచింత గ్రామం నుంచి నాగలదిన్నెకి వెళ్లే రహదారిని రూ.కోట్లతో నిర్మించబోతున్నామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మోసం గురించి బుట్టా రేణుక మాటలు హాస్యాస్పదం

- రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్న రాముడు

'మోసం గురించి వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక మాట్లాడడం హాస్యాస్పదంగా ఉంది. ఆమె ఎంపీగా ఉన్న సమయంలో మండలంలోని నాగలదిన్నె గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. దత్తత తీసుకున్న గ్రామంలో అభివృద్ధి చేపట్టకుండా ప్రజలను మోసం చేశారు. అలాంటి వ్యక్తి మోసం గురించి చెబితే ప్రజలు నమ్మే స్థితిలో లేర'ని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లష్కర్ మృతి

ప్రజాశక్తి - కౌతాళం/ఆదోని

ఆదోని పట్టణం శివారు ప్రాంతమైన ఆరెకల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో లష్కర్ తిరుపాల్ మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. తిరుపాల్ శుక్రవారం భార్య, పిల్లలతో తిరిగి వస్తున్న సమయంలో ఆరెకల్ వద్ద లారీ ఢీకొనడంతో ఈ సంఘటన చోటుచేసుకుంది. మృతుడు తిరుపాల్ తుంగభద్ర దిగువ కాలువ సబ్ డివిజన్-1లో కౌతాళం సెక్షన్‌లో లష్కర్‌గా విధులు నిర్వహించేవారు. ఈయన వెంట ఉన్న భార్య సుమలత, కుమారుడు విక్రాంత్ తేజ్ గాయాలకు గురయ్యారు. చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా చౌడేశ్వరి దేవి పల్లకి మహోత్సవం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవస్థానంలో పల్లకి సేవ మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవి దేవస్థానంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పల్లకి సేవ మహోత్సవం నిర్వహించారు. చౌడేశ్వరి దేవి ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహించి ఆలయ ప్రాంగణంలో పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

సూపర్ జిఎస్‌టితో ప్రజలకు ఊరట



ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్

సూపర్ జిఎస్‌టితో ప్రజలకు పెద్ద ఊరట లభించిందని వాణిజ్య పనుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ భువనేశ్వరి పేర్కొన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలోని పొదుపు భవనంలో ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ వస్తువులపై జిఎస్‌టి 2.0పై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మందుల ధరలు తగ్గించడం, ఆరోగ్య సేవలు చవకగా చేయడం, ప్రతి కుటుంబం భీమా సౌకర్యం పొందేలా చేయడం, జీఎస్టీ 2.0 సంస్కరణలతో ప్రాణ, రక్షక మందుల ధరలు తగ్గుతాయన్నారు. ఆరోగ్య, జీవిత బీమా తీసుకోవడం సులభం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామాంజనేయులు, సూపరింటెండెంట్ నాగరాజు, హమీద్ గ్రామ పంచాయతీ ఇఒ సతీష్ రెడ్డి, జాతీయ ఉపాధి పథకం ఎపిఒ పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల మండలం గొల్లగుట్ట గ్రామంలో బనగానపల్లె మండలం పలుకూరు గ్రామం సమీపంలో శుక్రవారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు. బనగాలపల్లె మండలం పలుకూరు గ్రామం నుండి నాపరాయి లోడుతో బేతంచెర్లకు వస్తున్న ట్రాక్టర్, బేతంచెర్లకు మోటార్ సైకిల్‌పై వస్తున్న నరేంద్ర రెడ్డి(34)తోపాటు గ్రామానికి చెందిన చాకలి సుబ్బమ్మలను ట్రాక్టర్ ఢీకొట్టింది. నరేంద్ర రెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. అతనితోపాటు చాకలి సుబ్బమ్మకు, రోడ్డు పక్కన వెళ్తున్న ఓ బాలికకు గాయాలు అయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం బేతంచెర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బేతంచర్ల పోలీసు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల

- సిపిఐ నాయకుల హర్షం



ప్రజాశక్తి - రుద్రవరం

సిరివెళ్ల రుద్రవరం ఆర్అండ్‌బి రోడ్డుకు రూ. 1 కోటి 75 లక్షల నిధులు విడుదల కావడం పట్ల సిపిఐ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సిపిఐ నాయకులు కొమ్ము భాస్కర్, బాల నరసింహుడు శుక్రవారం మాట్లాడుతూ గతంలో సిపిఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించి పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఆర్అండ్‌బి అధికారులు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆళ్లగడ్డ కోర్టులో పిటీషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. ఇందుకు జిల్లా కలెక్టర్ స్పందించి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల కలెక్టర్ రాజకుమారి గణియాకు, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు కృతజ్ఞతలు తెలిపారు.

బాల్య వివాహాలు ప్రోత్సహిస్తే చట్టరీత్య నేరం



ప్రజాశక్తి - చాగలమర్రి

బాల్యవివాహాలను ప్రోత్సహించినా, బడీడు పిల్లలను పనికి పంపించిన బాల్య వివాహ నిషేధ చట్టం ప్రకారం, బాల కార్మిక చట్టం ప్రకార నేరమని గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి పర్వీన్ అన్నారు. 11వ అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ టీచర్ కళావతి ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిషేధ చట్టంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా సంరక్షణ కార్యదర్శి పర్వీన్ మాట్లాడుతూ బాల్య వివాహం చేసుకోవడం ద్వారా అనేక అనారోగ్య పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించరాదన్నారు. బాల్య వివాహాలు నిర్వహించే వారి వివరాలు తెలియజేస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు ఆదిలక్ష్మి, అంగన్వాడీ టీచర్ చంద్రకళ, అంగన్వాడీ సహాయకురాలు గుర్రమ్మ, మాబుచాన్ పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - బేతంచర్ల


మృతురాలు మాధవి(ఫైల్)

కుటుంబ కలహాలతో వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు బేతంచర్ల పట్టణం సంజీవ్ నగర్ నీళ్ల ట్యాంక్ వద్ద నివాసం ఉంటున్న చికెన్ షాప్ మద్దయ్య కుమార్తె మాధవిని 12ఏళ్ల కిందట కర్నూలుకు చెందిన కృష్ణకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి దర్శిని(10), పురుషోత్తం(8) వయసు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వివాహం అయినప్పటి నుండి కొంత కాలం దాంపత్య జీవితం సజావుగానే సాగింది. అయితే ఈ మధ్య కాలంలో భర్త చెడు అలవాట్లకు, తాగుడుకు బానిస అయ్యాడని, పిల్లల్ని, నన్ను పట్టించుకోవడం లేదని తాగి వచ్చి వేధిస్తున్నాడని చెప్పిందన్నారు. తల్లిదండ్రులు, బంధువులు కర్నూలుకి వెళ్లి మృతురాలి భర్త కృష్ణకు సర్ది చెప్పామన్నారు. భర్త మారకపోవడంతో రెండు నెలల కిందట కూతురును, పిల్లలను ఇంటికి తీసుకొచ్చామని, పిల్లల్ని బేతంచర్ల హనుమాన్ నగర్ స్కూల్లో చేర్పించామని తెలిపారు. మృతురాలి భర్త కృష్ణ తనను, పిల్లల్ని తీసుకుని వెళ్లడానికి రాకపోగా మనస్థాపానికి గురై మాధవి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని తల్లిదండ్రులు బోరున విలపించారు. మృతురాలి పిల్లలు, తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

రైతాంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు

- ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ - జిల్లా 2వ మహాసభను జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నంద్యాల జిల్లా రైతాంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ రాజశేఖర్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్‌లు పేర్కొన్నారు. పట్టణంలోని సుదర్శన వర్మ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 11, 12(శని, ఆదివారం) తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నంద్యాల జిల్లా రెండవ మహాసభలు ఆత్మకూరు పట్టణంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభలకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జాతీయ నాయకులు, రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు రమేష్ కుమార్, రైతాంగ ఉద్యమ నాయకులు, ప్రముఖులు హాజరవుతారన్నారు. జిల్లాలో వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు లిఫ్టుల కోసం ఉద్యమాలు చేపట్టి వాటిని సాధించుకున్నట్లు గుర్తు చేశారు. మెట్ట ప్రాంతాలకు ఎత్తిపోతల పథకాల అమలు కోసం, జిల్లాలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. మహాసభలకు నంద్యాల జిల్లాలోని రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు వెంకటేశ్వరరావు, వీరన్న పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి ప్రయత్నిస్తాను

- కళాశాల డైరెక్టర్ డాక్టర్ నారాయణ భరత్ గుప్తా


విద్యార్థినీ, విద్యార్థులతో కాలేజీ సమస్యలను తెలుసుకుంటున్న భరత్ గుప్తా

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం మండలం సున్నిపెంటలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నారాయణ భరత్ గుప్తా శుక్రవారం సందర్శించారు. ముందుగా ఆయనకు కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పుష్పగుచ్చంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి తన వంతు ప్రయత్నిస్తానని, అదే విధంగా జిల్లా స్థాయిలో చేయగలిగిన వాటన్నింటిని జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీకెళ్లి పరిష్కరిస్తానన్నారు. కళాశాల డైరెక్టర్ కళాశాల సందర్శనలో భాగంగా ఆధ్యాపకులతో, విద్యార్థిని, విద్యార్థులను వివిధ సమస్యలపైన అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో మౌలిక వసతుల గురించి చర్చించి కళాశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అలాగే కళాశాల నిర్వహణ పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా జెసి విష్ణు చరణ్, శ్రీశైలం తహశీల్దార్ శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మందులను పంపిణీ చేస్తున్న దృశ్యం

గర్భకోశ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - చాగలమర్రి

పశువుల్లో గర్భకోశ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి, ఎప్పటికప్పుడు పశువైద్యులను సంప్రదించాలని పట్టణ ప్రాంతీయ పశువైద్యశాల ఇన్‌ఛార్జ్ సహాయ సంచాలకులు డాక్టర్ ప్రతాప్ తెలిపారు. మండలంలోని చింతల చెరువులో పశుగణాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో శుక్రవారం నిర్వహించిన ఉచిత పశు గర్భకోశ చికిత్స వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పశు వైద్యాధికారులు దీపాకుమారి, పుల్లయ్య, సాయిబాబాలు పశువుల్లో ఎదకు రాని, తిరగ కట్టే 43 పశువులకు పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం వ్యాధి నివారణ టీకాలు పంపిణీ చేస్తుందని, రైతులు వాటిని వినియోగించుకోవాలన్నారు. పాడి రైతులకు లింగ నిర్ధారణ వీర్యం వాటి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది షాజీబాష, మురళీ కృష్ణ, మహబూబ్‌బాష, ఎహెచ్‌ఎలు పాల్గొన్నారు.

సిసి రోడ్లు నిర్మించండి

ప్రజాశక్తి - కోవెలకుంట



మండలంలోని కలుగొట్ల గ్రామం రెండు కొత్త కాలనీలో వెంటనే సిసి రోడ్లు నిర్మించాలని ఆ కాలనీ వాసులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వీధుల్లో వర్షా కాలం కావడంతో మట్టి రోడ్లపై నడవాలంటే ఇబ్బందిగా ఉందని, పిల్లలు, ముసలి వాళ్లు జారి కింద పడుతున్నారని కాలనీ వాసులు వెంకటేశ్వర రెడ్డి, వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ విషయంపై అధికారులను, రాజకీయ నాయకులను అడిగినా స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని కాలనీల్లో సిసి రోడ్లు వేయాలని కోరారు.

కీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలి : ఎంఇఒ


పాణ్యంలో..

ప్రజాశక్తి - పాణ్యం

ఒకప్పుడు పాణ్యం క్రీడలకు పెట్టింది పేరని, పాణ్యం నుండి ఎంతో మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచారని, మళ్లీ అలాంటి పూర్వ వైభవం పాణ్యానికి తీసుకుని రావాలని ఎంఇఒ-2 సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని యాజమాన్యాల అండర్-14, 17 బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, (వ్యక్తిగత క్రీడాంశాలు) యోగ, బ్యాట్మెంటన్, చెస్‌కు పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీంలను ఎంపిక చేసినట్లు తెలిపారు. అన్ని పాఠశాలల నుండి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ప్రతిభగల క్రీడాకారులు నంద్యాల డివిజన్ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని మండల క్రీడా కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. గవర్నమెంట్ హైస్కూల్ పాణ్యం ప్రధానోపాధ్యాయులు రాముల నాయక్ అధ్యక్షతన నంద్యాల, డోన్ ఉప విద్యాశాఖ అధికారులు శంకర్ ప్రసాద్, వెంకట్రాం రెడ్డి, ఎంఇఒ, ప్రజా ప్రతినిధులు, రమణమూర్తి, రంగ రమేష్, లాయర్ బాబు, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు నాగగోపేశ్వరరావు(గోపి) వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాణ్యం మండల స్థాయి ఎంపిక పోటీలు మండల క్రీడా కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. క్రీడాకారులకు గవర్నమెంట్ హై స్కూల్ పాణ్యంలో భోజన వసతి కల్పించినట్లు ఎంఇఒ సుబ్రహ్మణ్యం తెలిపారు.

బనగానపల్లె : పట్టణంలోని నెహ్రూ సీబీఎస్ఈ పాఠశాల మైదానంలో మండల ఎస్‌జిఎఫ్ స్కూల్ గేమ్స్ ప్రభుత్వ జిల్లా పరిషత్, ప్రవేట్ యాజమాన్య స్కూల్ గేమ్స్‌ను ఎంఇఒ-2 శ్రీనివాసులు శుక్రవారం ప్రారంభించారు. 300 మంది విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నెహ్రూస్కూల్ యాజమాన్యం కోడూరు కమల్ తేజ రెడ్డి, కోడూరు రవితేజ రెడ్డి, స్కూల్ గేమ్ కోఆర్డినేటర్ హరికృష్ణ, పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రుద్రవరం : మండలస్థాయి ఎస్‌జిఎఫ్ పోటీలను నరసాపురం జెడ్పిహెచ్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఎంఇఒలు వీరరాఘవయ్య, లక్ష్మీ అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయుని రాజ్యలక్ష్మి, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సంగేపు నాగేశ్వరావు, జడ్పిహెచ్ఎస్ రుద్రవరం ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ ఆధ్వర్యంలో మండల ఎస్‌జిఎఫ్ కోఆర్డినేటర్ ధర్మరాజు, ఏపీ మోడల్ స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు, ఎర్రగుడిదిన్నె ఫిజికల్ డైరెక్టర్ దాసు పరిశీలనలో బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ అండర్ 17, అండర్-14 పోటీలు నిర్వహించారు. పోటీలలో నైపుణ్యం కనబరిచిన విద్యార్థిని విద్యార్థులను డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. పోటీల్లో 350 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పగిద్యాల : బాలికల మండల స్థాయి క్రీడా పోటీలను పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రావు శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండల స్థాయి బాలికల క్రీడా పోటీలలో కబడ్డీ, చెస్, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాట్మెంటన్, అథెంటిక్స్, యోగ క్రీడా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పోటీలలో ఎంపికైన క్రీడాకారులు డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. డివిజన్ స్థాయిలో ఎంపికైన వారు జిల్లా స్థాయిలో, జిల్లా స్థాయిలో ఎంపికైన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. బాలికలు చదువులతోపాటు క్రీడల్లో రాణించి పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.


పగిడ్యాల : పోటీలను ప్రారంభిస్తున్న ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రావు


బనగానపల్లె : స్కూల్ గేమ్స్‌ను ప్రారంభిస్తున్న ఎంఇఒ శ్రీనివాసులు

ప్రభుత్వ నిబంధనలతో వెదురు సేకరించాలి

ప్రజాశక్తి రుద్రవరం

ప్రభుత్వ నిబంధనలతో అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏటా వెదురు సేకరించాలని కాంట్రాక్టర్ పోలా రమేష్ తెలిపారు. మండల కేంద్రంలోని అటవీ క్షేత్ర అధికారి కార్యాలయం వెదుర్ల డిపో ఎదురుగా, అటవీ సమీపాన గల గిరిజనుల వాడ హరినగరంలో కూలీలతో వెదురు సేకరణపై శుక్రవారం సమావేశమై మాట్లాడారు. 35ఏళ్ల నుండి వెదురు చేస్తున్నారని, మూడేళ్ల నుండి వెదురు సేకరణ నిలిపివేశారన్నారు. మండలంలోని 20 గ్రామాల ప్రజలు దాదాపు రూ. 20వేల మంది కూలీలు పనులు లేక కూలి పనికి వెళ్లాలంటే అన్ని పనులకు ఈ టెక్నాలజీ యుగంలో యంత్రాలు రావడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా రుద్రవరం అటవీ రేంజ్ పరిధిలో చిల్లమానుపెంట, గొర్రె గుంత, మామిడి మాను చెలిమె, అహోబిలం అనుపేరు గల వెదురు కూపులు వందల హెక్టార్లలో వ్యాపించి ఉన్నాయన్నారు. ఈ వెదురు సేకరణకు ప్రతి ఏటా టెండర్లు పెట్టి టెండర్ పాడుకున్నా వారికి అటవీశాఖ ఆధ్వర్యంలో సంబంధిత కాంట్రాక్టర్లకు అప్పచెప్పి సేకరించిన వెదురులను అటవీ శాఖ కార్యాలయం డిపోలో లాట్లుగా పేర్చి వేలం వేసేవారని తెలిపారు. వేలం ద్వారా వచ్చిన పైకమును చలానా రూపంలో సంవత్సరానికి ప్రభుత్వ ఖజానాకు రూ. 3కోట్ల ఆదాయం పంపేవారమన్నారు. ఇప్పుడు వన్యప్రాణి చట్టం ద్వారా కారిడార్ చేసి వెదుర్ల సేకరణ నిలిపివేసి అన్యాయం చేశారన్నారు. ఇప్పటికైనా సిఎం, డిప్యూటీ సిఎంలు స్పందించి ఆళ్లగడ్డ నియోజకవర్గం రుద్రవరం అటవీ రేంజిలో తిరిగి వెదురు సేకరణ పునరుద్ధించి వేల కుటుంబాలకు జీవనోపాధి కల్పించాలని ఆయన కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న కాంట్రాక్టర్ రమేష్

ప్రధాని సభను విజయవంతం చేద్దాం: టిడిపి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

ఈనెల 16న కర్నూలు జిల్లాలో నిర్వహించనున్న ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభను జయప్రదం చేద్దామని, జిల్లాను అభివృద్ధి చేసుకుందామని టిడిపి నాయకులు పలువురు అన్నారు. శుక్రవారం టిడిపి కర్నూలు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని టిడిపి జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు తిక్కారెడ్డి, ఎంపి. నాగరాజు, ఎమ్మెల్సీ బిటి.నాయుడు, ఎమ్మెల్యేలు కెయి. శ్యామ్‌కుమార్, బొగ్గుల దస్తగిరి, ఎస్.రాఘవేంద్రారెడ్డి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, డి.విష్ణువర్ధన్‌రెడ్డి, కె. మీనాక్షీనాయుడు, డాక్టర్ సంజీవకుమార్, వైకుంటం జ్యోతి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ దేశ ప్రదాని నరేంద్రమోది, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ఈనెల 16న ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనకు రానున్నారన్నారు. జిఎస్‌టి సంస్కరణల భహిరంగ సభకు హాజరుకానున్నారన్నారు. జిల్లాలోని ప్రజానీకం అధిక సంఖ్యలో హాజరై వారికి స్వాగతం పలికి భహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజానీకానికి కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ప్రధానమంత్రి సహకారంతో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా చూసుకొని ముఖ్యమంత్రి ముందుకు వెల్తున్నారని, ఇందులో భాగంగానే కర్నూలు జిల్లాలోని వెనుకబాటు తనాన్ని దృష్టిలో ఉంచుకొని దేశ ప్రధానిని జిల్లాకు రప్పించి వారి నుండి జిల్లా అభివృద్ధి కావలసిన నిధులను రాబట్టడానికి తీవ్ర కృషి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా రాయలసీమ పారిశ్రామిక కారిడార్, డ్రోన్, డిఆర్‌డిఒ వంటి వాటినే కాకుండా ఎన్నో పరిశ్రమలను తీసుకొని వచ్చి ఓర్వకల్లును పారిశ్రామిక హబ్ గా మార్చి జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు వారు చేయని ప్రయత్నమంటూ లేదన్నారు. శ్రీశైలం దేవస్థానం అభివృద్ధికి వారు ప్రత్యేక చొరవతీసుకొని ప్రదానమంత్రి ద్వారా అనుమతులు, నిధులు పొందే ప్రయత్నం చేస్తున్నారని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని వారు దేశ ప్రధానినే జిల్లాకు రప్పిస్తున్నారన్నారు. మనజిల్లా భవిష్యత్ తరాలకు బాటలు వేసేందుకై కృషి చేస్తున్నారన్నారు. కూటమి పార్టీల సహకారంతో తెలుగుదేశంపార్టీ అన్ని నియోజకవర్గాలు నుండి ప్రజలు వేలాదిగా తరలించి సభను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సమావేశం అనంతరం వారు ప్రధానమంత్రి బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు.

ప్రభుత్వ రాయితీ సేవలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-పత్తికొండ

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించే రాయితీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాంకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చిన్నహుల్తి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి వెంకట్‌రాముడు ఆధ్వర్యంలో రైతులకు రాయితీ పప్పుశనగ విత్తనాలను పత్తికొండ ఎమ్మెల్యే కెఇ. శ్యామ్ కుమార్ రైతులకు పంపిణీ చేసి మాట్లాడారు. రైతుల కోసం వ్యవసాయ పరికరం డ్రోన్ రాయితీతో రైతులకు అందజేస్తున్నామని అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులు మక్కువ చూపాలని అన్నారు. పప్పు శనగ క్వింటా పూర్తి ధర 7800 , సబ్సిడీ ధర 1950, పోను రైతు కింటాకు రూ.5850 చెల్లించాలన్నారు. మరిన్ని వివరాల కోసం వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిని లోకనాథ్, టిడిపి నాయకులు రంగయ్య మల్లికార్జున దోర్నానాయుడు పరిపూర్ణ గౌడ్ మండల విస్తరణ అధికారి రియాజ్ భాష , ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తి పెంచడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - పాములపాడు

పాడి పశువుల ఆరోగ్య సంరక్షణ ఆరోగ్యకరమైన పాల ఉత్పత్తి పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని పాములపాడు పశు వైద్యాధికారి డాక్టర్ భాస్కర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామంలో ఏర్పాటు చేసిన రాష్ట్రీయ గోకుల మిషన్ పథకంలో భాగంగా ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ 50 మంది రైతులకు చెందిన 9 ఆవులు, 47 గేదెలను పరిశీలించినట్లు తెలిపారు. అలాగే 70 దూడలకు నట్టల నివారణ మందులు పాపించి 37 సాధారణ కేసులకు చికిత్సలు చేసినట్లు తెలిపారు. నటల నివారణ వ్యాక్సియేషన్ వాటి ప్రాముఖ్యత మినీ గోకులాలు ఉపాధి హామీ పథకం ద్వారా పశుగ్రాస పెంపకం కేసిసి లోన్స్‌పై రైతులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో తుమ్మలూరు సర్పంచి వరప్రసాద్ మాట్లాడుతూ పాడి రైతుల ఆదాయం రెండింతలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ రవిశంకర్, డాక్టర్ సాయి లీల, డాక్టర్ అశోక్, వెటర్నటీ అసిస్టెంట్ శ్వేత, ఎహెచ్‌ఎలు కవిత, తిరుమలేష్, ప్రసన్న, చాందిని, పూజిత, గోపాలమిత్రలు మున్వర్ బాష, భాస్కర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట : ఎమ్మెల్యే గౌరు చరిత

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. శుక్రవారం ఓర్వకల్లు మండలం ఎంపిడిఒ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాయితీ శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పాల్గొని రైతులకు సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేశారు. టిడిపి మండల కన్వీనర్ గోవింద్ రెడ్డి ఓర్వకల్లు హుసేనాపురం సింగిల్‌విండో అధ్యక్షులు సుధాకరయ్య, సిఎస్ సుధాకర్ రెడ్డి, టిడిపి మండల సీనియర్ నాయకులు విశ్వేశ్వర్ రెడ్డి, ఎడ్యుకేషన్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ జి నాగముని, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణ పల్లె నాగిరెడ్డిఎంపీడీవో శ్రీనివాసులు మండల వ్యవసాయ శాఖ అధికారి మధుమతి టిడిపి నాయకులు పాల్గొన్నారు.